



సంధ్యను చూసి చాలారోజులయింది.

ఇది మార్చి నెల — ఆఖరువారం. ఫిబ్రవరి మొదటివారంలో అనుకుంటాను — సంధ్యవేళ, ఇలాగే, ఒక్కదాన్నే కాలేజి నుంచి రావాల్సిన శ్రీవారికోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను. పోర్టికోలో కారు ఆగిన శబ్దం అయింది. ఆ శబ్దం సుపరిచితం. పిక్చర్ ప్రారంభంలో చూసే సింహగర్జనపట్టి యం. జి. యం. వారి పిక్చరని తెల్సుకున్నట్లుగా, లేదూ, ప్రసారం ప్రారంభంలో రెండు నిమిషాలసేపు విన్పించే సిగ్నేచర్ ట్యూన్ వల్ల ఆలిండియా రేడియో ప్రసారమని పోల్చుకునే విధంగా — ఆ ఆగిన కారు ఎవరిదో చూడకుండా తెల్సుకోవచ్చు.

ఆ వచ్చిన కారు చంద్రశేఖర్‌గారిది. అందులో వచ్చినవారు చంద్రశేఖరం, సంధ్య కాని ఇంట్లోకి వచ్చినది మాత్రం సంధ్య

సంధ్యను డ్రాప్‌చేసి చంద్రశేఖరం వెళ్ళిపోయాడు.

''గుడ్ ఈవెనింగ్ మేడమ్!'' విష్ చేసింది సంధ్య. తెల్లని పలువరస తళుక్కుమంది.

ఇందాకటినుంచీ మసకమసకగా వెలుగుతూన్న నలభైవాట్ల డే లైట్ ట్యూబ్ కాంతివంతమయింది.

సంగీతానికి మొక్కలు ఏపుగా పెరుగుతాయి అని ఎక్కడో చదివినట్లు గుర్తు. రెండింతలు కాంతివంతమయిన ఈ డే లైట్ ట్యూబు చూస్తుంటే లైట్లు నవ్వులజల్లుకు రెస్పాండవుతాయేమో ననిపిస్తుంది.

సంధ్య కంపెనీ అంటే నేను అందుకే ఇష్టపడతాను. ఎల్లప్పుడూ మొహం కళకళలాడుతుంది. ఫైనల్ బి. ఏ. చదువుతోంది విద్య విజ్ఞానంకొరకు అన్న ఉద్దేశంతో చదివే పిల్ల. రిటైర్డ్ ఛీఫ్ ఇంజనీరుగారి కూతురు. చీకూ చింతాలేని జీవితం.

''రా, సంధ్యా! కూర్చో!''

ఎదురుగా సోఫాలో కూర్చుంది.

''చంద్రశేఖర్ లోపలికి రాకుండా వెళ్ళేడేం?'' అని అడిగాను.

''ఇప్పుడే ఆఫీసు నుంచి ఇంటికి వెళ్తున్నాడు. దోవలో కన్పించాడు. నేనిలా మీ యింటికి బయల్దేరానంటే డ్రాప్ చేస్తానని లిఫ్ట్ యిచ్చాడు మాష్టారింకా రాలేదా?''

''రాలేదు. కాలేజీలో ఏదో మీటింగు వుంది. ఆలస్యంగా వస్తామన్నారు.''

''అవునవును. స్టాఫ్ అసోషియేషను మీటింగుందిట ఈరోజు.''

''అసలు సంగతి తప్పిస్తున్నావ్! పెళ్ళిమాటేం జేశావ్?''

''ఈ పరీక్షలయింతర్వాతనే పెళ్ళి ప్రసక్తి.''

''ఇంకెంత? రెండునెలల్లో పరీక్షలయిపోతాయిగా! నువ్వు నిర్ణయించుకుని మీవాళ్ళకు చెప్తే వాళ్ళు ప్రయత్నంలో వారుంటారుగా!''

''నిర్ణయమా?'' ఎంతో తేలికగా అన్నది సంధ్య.

నా కర్థంకాలేదు. వివాహ మనేది సంధ్యకెంతో తేలికయిన విషయంలాగా కన్పిస్తున్నది మూరేళ్ళ జీవితంలో పెళ్ళి తాలూకు ప్రాముఖ్యం తెలియకనా? లేక జీవిత భాగస్వామిని ఎన్నుకునే బాధ్యత తాలూకు విలువ గుర్తించకనా?

చంద్రశేఖర్, భాస్కర్ — వీరిద్దరిలో ఎవరో ఒకర్ని నిర్ణయించుకోవాలి సంధ్య. తల్లిదండ్రులు అభ్యుదయభావాలు కల తల్లిదండ్రులు వర నిర్ణయం సంధ్యకే వదిలేశారు.

చంద్రశేఖర్ ఒక ప్రైవేటు కంపెనీకి మేనేజరు. పొడవుగా, పొడవుకుతగ్గ లావుగా, అంతేకాక పచ్చగానూ వుంటాడు. ఆస్తిపాస్తులు బాగా వున్నవాడు. నలగని మాటు, చెరగని తల, రోల్డ్‌గోల్డ్ ఫ్రేము కళ్ళజోడు, మాటాడే తీరు- అతని ఉద్యోగానికీ, హోదాకూ తగ్గట్టుగా వుంటాయి.

భాస్కర్ బక్కపల్చగా వుంటాడు. చామనఛాయ. బి. ఇ. మెకానికల్‌లో యూనివర్శిటీ ఫస్ట్‌గా వచ్చాడు. జూనియర్ ఇంజనీరుగా గవర్నమెంట్ సర్వీసులో వున్నాడు. ఆస్తి అంటూ ఏమీ లేదు. వృత్తికి ఇంజనీరయి మెసిలేది యంత్రాలతోనయినా. సాహిత్యమంటే చెవికోసుకుంటాడు. మార్కెట్టులోకి కొత్త పుస్తకం వస్తే కొనకుండా ఊరుకోడు. పట్నంలో సాహిత్య సమావేశం జరుగుతున్నదంటే హాజరుకాకుండా వుండడు.

వీరిద్దరూ సంధ్యను ప్రేమిస్తున్నారు; వివాహం చేసుకోవాలని వాంఛిస్తున్నారు.

సంధ్యను సుఖపెట్టే తాహతు యిద్దరికీ వుంది.

ఆమెతో తూగగలవారేను యిద్దరూ.

ఆమె స్నేహం పొందుతున్నారు ఇద్దరూనూ.

ఆమె కలిసిమెలిసి వుంటున్నది ఇద్దరితోనూ

సంధ్య తల్లిదండ్రులకు యిష్టమే వీరిద్దరంటేను

ఇది నా కొక్కదానికేకాదు తెలిసింది, అందరూ ఎరుగున్న విషయమే

కాని

సంధ్య, వీరిద్దరిలో ఎవరిని వివాహం చేసుకునేది నా కొక్కదానికేకాదు తెలియనిది, ఎవ్వరికీ అర్థంకానిది.

ఈ వర నిర్ణయం సంధ్యతో పరిచయం వున్న మా అందరికి సమస్య.

కాని

సంధ్యకి ఇదో సమస్యలాగా కన్పించటంలేదు కనీసం ఏకవర్ణ సమీకరణంలాగా కూడా తోచటంలేదు. ఒకటీ, ఒకటి రెండు అన్నంత సులభంగా వుంది. సంధ్యకు అంత ధైర్యం ఎక్కడినుంచి వచ్చిందో నా కర్థంకావటంలేదు

ఈ రెండు నెలల్లో సంధ్య కన్పించలేదు. పరీక్షలకు చదువుకుంటున్నదేమో, డిస్టర్బ్ చేయటం ఎందుకని నేనూ వాళ్ళింటికి వెళ్ళలేదు.

చంద్రశేఖర్ జాడలేదు. సామాన్యంగా చంద్రశేఖర్ ఒంటరిగా ఎన్నడూ మా యింటికి రాడు. వెంట ఎవరో ఒకరుండాలి — కామన్ ఫ్రెండ్. ఆ ఫ్రెండ్ సంధ్య ఒక్కతే మాకు. సంధ్య పరీక్షలు కారణాన యింట్లో నుంచి బయటికి రావటమేలేదు. చంద్రశేఖర్ తను ఒక్కడే రావటానికి బిడియం. ఒకసారి యీ విషయంలో నొచ్చుకున్నాడుకూడాను — బిడియాన్ని గర్వమనుకుంటున్నారని. ఒక్కొక్కరి తత్వమే అంత. నేను ఈ విషయంలో అతన్ని తప్పుపట్టను. అతనికి గర్వమెంతమాత్రమూ లేదు. సద్యంతో మా యింటికి చాలాసార్లు

వచ్చాడు. తనొక ఆఫీసరుననిగాని, ఆస్థిపరుడనని గాని గుర్తుంచుకొనేవాడుకాదు. స్నేహితుడుగా మాట్లాడేవాడు.

భాస్కర్ అసలు మా యింటికి ఇంతవరకెన్నడూ రాలేదు. క్రితం ఉగాదినాడు, ఆకాశవాణి రసజ్ఞులయిన ఆహూతుల సమక్షంలో కవి సమ్మేళనం ఏర్పాటుచేస్తే శ్రీవారితో నేనూ వెళ్ళాను. అక్కడ ఆకాశవాణి ఆవరణలో సంధ్య భాస్కర్‌ని పరిచయం చేసింది. ఆనాటినుంచి అలాగే ఎక్కడో సాహితీ సభల్లోనో, సాంస్కృతిక సమావేశాల్లోనో కన్పిస్తూవుంటాడు భాస్కర్. సన్నగా చిరునవ్వు విసురుతూ విష్‌చేస్తాడు. చక్కగా వినసొంపుగా మాట్లాడుతాడు. లోతైన ఆలోచన వున్నవాడు. ఈమధ్య భాస్కర్‌కూడా కన్పించలేదు. కాంప్ కేమయినా వెళ్లాడేమో! అప్పుడప్పుడు ఫీల్డు వర్క్ వుంటుంది అతనికి!

సంధ్య విషయం తెలిసే అవకాశమే చిక్కలేదు.

కాలేజీనుంచి శ్రీవారింకా రాలేదు. ఆరు గంటలయింది.

గుమ్మంలో సైకిలేదో ఆగింది. ఒక కుర్రవాడు చీటీ తెచ్చియిచ్చాడు. కాలేజీలో ఏదో కాంపిటీషను నిర్వహిస్తున్నారుట, శ్రీవారు ఎనిమిది గంటలకిగాని రారని కబురు.

రెండు గంటల వ్యవధి వుంది. సంధ్యను చూసివద్దామని బయల్దేరాను.

"గుడ్ ఈవెనింగ్ మాడమ్!"

వెనకకి తిరిగిచూస్తే చంద్రశేఖర్.

ఆ వెనక సంధ్య.

"రండి! రండి!" ఆహ్వానించాను.

వారిద్దరూ లోపలికి వచ్చారు.

సంధ్య నా పక్కనే సోఫాలో కూర్చుంది. చంద్రశేఖర్ ఎదురుగా కూర్చున్నాడు.

"మీ ఇంటికనే బయల్దేరాను సంధ్యా! పరీక్షలు బాగా వ్రాశావా?"

"మాష్టారు చెప్పలేదా?" ఎదురు ప్రశ్న వేసింది సంధ్య.

"మాష్టారు చెప్పారనుకో. అయినా మాష్టారు చెప్పటంలోనూ, నువ్వు చెప్పటంలోనూ తేడా లేదూ?"

"అయితే సరే — బాగానే వ్రాశాను."

"క్లాసు వస్తుందా?" నవ్వి ఊరుకున్నది సంధ్య సమాధానంగా.

చంద్రశేఖర్ టీపాయ్‌మీది వీక్లీ చేతిలోకి తీసుకుని కార్టూన్స్ చూస్తున్నాడు.

"పరీక్షలంటూ వాయిదా వేస్తూ వచ్చావ్. పరీక్షలయిపోయినాయికదా అనే — మీ యింటికి బయల్దేరాను సంధ్యా!" మెల్లగా సంధ్యతో అన్నాను.

సంధ్య చెక్కిళ్ళలో గులాబీలు, కళ్ళలో మెఱుపులు.

సిగ్గుపడుతూన్న సంధ్యను చూస్తే వరనిర్ణయం చేసుకున్నట్లుగా కన్పిస్తున్నది.

ఆ నిర్ణయమేదో తెల్సుకోవాలని ఉత్కంఠ!

కాని చంద్రశేఖర్ యిక్కడ వుండగా ఎలా అడిగేది?

అందుకు ఒక ఉపాయం ఆలోచించాను.

"చంద్రశేఖర్‌గారూ! మీరు మా లైబ్రరీ చూడలేదుకదూ! రండి." చంద్రశేఖర్ని మా స్టడీ రూముకు తీసికెళ్లాను.

విశ్వకవి రవీంద్రులు, నాటక చక్రవర్తి షేక్స్పియర్, నవలా సార్వభౌముడు సోమర్సెట్‌మాం, కథాసామ్రాట్ ఓహెన్రీ — ఒక్కొక్కరి రచనలూ పట్టిచూస్తున్నాడు చంద్రశేఖర్.

మరొక రాక్‌లో—ఆధునిక ఆంధ్ర సాహిత్యం— బుచ్చిబాబు, బాపిరాజు, విశ్వనాథ, మల్లాది, శ్రీపాద, రావకొండ, కొడవటిగంటి — రచనలు.

"మాడమ్! ఈ పుస్తకాలన్నీ ఊరికనే తిరగేయాలన్నా ఇది సమయంకాదు. మరొకసారి వస్తాను." చంద్రశేఖర్ మాటల్లో అశక్తత, అనాసక్తత రెండూ వెల్లడి అయాయి. నా ఉద్దేశమూ అతను ఇప్పుడు అవన్నీ చదవాలని కాదు. ఒక్క అయిదునిమిషాలు సంధ్యతో ఒంటరిగా మాట్లాడే అవకాశం కావాలని.

"అయితే! ఇదిగో మేము ఆలిండియా టూర్‌కి వెళ్ళినపుడు తయారుచేసిన ఆల్బమ్. ఇది చూస్తూవుండండి. ఈలోగా కాఫీ తెస్తాను." అని ఆల్బమ్ ఇచ్చి డ్రాయింగ్ రూములోకి వచ్చాను. ఇప్పుడు సంధ్య అభిప్రాయం తెల్సుకోవచ్చు.

సంధ్యను కూడా కిచెన్‌లోకి తీసికెళ్ళి అడిగాను.

"స్వయంవరం అయిందా సంధ్యా!"

సంధ్య సిగ్గుల పెళ్లికూతురయింది. మాట్లాడలేదు.

"చదువుకున్నదానివి. నువుకూడా అలా సిగ్గుపడతావేం సంధ్యా! అందులో నీ నిర్ణయం కూడానాయను."

"అది చెప్దామనే వచ్చాను — మాడమ్!"

అయితే — చంద్రశేఖర్ని ఎన్నుకున్నదా సంధ్య. అందుకనే యిద్దరూ కల్సివచ్చారా?

అవును — ఒకవిధంగా చూస్తే చంద్రశేఖర్ మెరుగు. ఆస్థి బాగా వుంది కాబట్టి నగలూ, నాణేలూ పెట్టుకోవచ్చు. మంచి ఉద్యోగం కాబట్టి నౌకర్లూ, చాకర్లూ వుంటారు. కారు వుంది కాబట్టి హుషారుగా షికార్లు చేయవచ్చు.

భాస్కర్‌కి ఆస్థిలేదు, నౌకర్లున్న ఉద్యోగం కాదు, కారు లేదు. మరేమి చూసి భాస్కర్‌ని వరిస్తుంది సంధ్య!

ఇలాగా ఆలోచించివుంటుంది సంధ్య.

అదే అడిగాను. సంధ్య దగ్గర నాకు చనువు వుంది కాబట్టి.

"మీరు పెద్దలు. మీముందు నేను విపులంగా చెప్పకూడదనుకొండి. అయినా మీరు అడిగారు కాబట్టి చెప్తున్నాను. నగలూ — నాణేలూ, నౌకర్లూ — చాకర్లూ, కార్లో షికార్లుకాదు నేను కోరుకునేది...'

అక్కడ ఆగింది సంధ్య. తను కోరుకునేది ఏమిటో చెప్పలేదు. అదేమిటో నేను గ్రహించక పోలేదు.

"అవును — సంధ్యా! నగలూ. నౌకర్లూ కాదు ఆడది కోరుకునేది. వాటన్నిటికంటె భర్త ప్రేమ, భర్త మనసు ముందు కావాల్సినవి. చంద్రశేఖర్ ఈ రెండూ ఈయగలవాడు." నా మనసులో మాట వ్యక్తం చేశాను.

"ఈయలేడని నేనననను. నాకోసం, నా సుఖం కోసం, ఎంతయినా ఖర్చు పెట్టగలడు; నన్నెంతగానో ప్రేమిస్తున్నాడు. కాని ఆ ప్రేమకు వెనుక..."

ఎందుకో సంధ్య సూటిగా చెప్పలేకపోతున్నది.

సంధ్య ఎవర్ని నిర్ణయించుకున్నది? చంద్రశేఖర్ని కాదా? కానిపక్షంలో భాస్కర్ని వివాహమాడ నిశ్చయించుకున్నదా? కథ మొదటికి వచ్చింది.

సంధ్య చంద్రశేఖర్ ప్రేమని అనుమానిస్తున్నది. స్పష్టంగా చెప్పమన్నాను.

"చంద్రశేఖర్ ప్రేమ వెనుక అనురాగం లేదు. అధికారం వుంది."

సంధ్య చంద్రశేఖర్ని సరిగా అర్థం చేసుకోలేదేమో అనిపించింది. ఆఫీసులో వున్నంతవరకే అతను ఆఫీసరు. బయటికి వచ్చాక సబార్డినేట్సుతో సాటి మానవుడిలాగా ప్రవర్తిస్తాడు. అది నేను చూశాను. చాలామంది చెప్పగా విన్నాను.

సంధ్య యిక్కడ పొరపడ్డదేమో?!

సంధ్య అటువంటి అభిప్రాయానికి ఎలా వచ్చిందో చెప్పమని అడిగాను.

"చెప్తాను. మాడమ్! మీరు నే చెప్పేది విని నా అభిప్రాయం సరి అవునో కాదో, మీరు చెప్పాలి."

"అలాగే"

* * *

సాయంత్రం అయిదు గంటలవుతుండగా ఫోన్ మోగింది. ఫోన్ ఎత్తితే అవతల చంద్రశేఖర్!

"సంధ్యా! ఒక పావుగంటలో వచ్చేస్తున్నా. రెడీగా వుండు."

"ఏమిటి? విశేషం?"

"నువ్వు నాతో వస్తున్నావ్! రెస్ట్ ఇన్ పర్సన్."

చంద్రశేఖర్‌తో వచ్చిన చిక్కే యిది. వివరం చెప్పడు.

తయారయింది సంధ్య. అన్నట్లుగానే పావుగంటలో వచ్చాడు చంద్రశేఖర్. ఫ్రెంటు డోరు తీశాడు. లోపల కూర్చున్నది సంధ్య.

దారిలో చంద్రశేఖర్ మాట్లాడలేదు. ఆఫీసులు, కాలేజీలు, స్కూళ్లు వదిలే సమయం కావటాన రోడ్డు రద్దీగా వుంది చేయి స్టీరింగుమీద, దృష్టి రోడ్డుమీద.

పది నిమిషాల తర్వాత కారు పక్కగా పార్క్ చేశాడు. దిగి గార్డెన్‌లో కూర్చున్నాం.

"సంధ్యా! ఇవ్వాళ ఏ విషయమూ నువ్వు తేల్చిచెప్పాలి."

బహుశా — ఇందాకటి నుంచి చంద్రశేఖర్ పెళ్లి విషయమే ఆలోచిస్తున్నాడు.

"పరీక్షలు కానీయండి!" సంధ్య ధ్యాస

[33వ పేజీ చూడండి]



★ ][ ★ ][ ★ ][ ★ ][ ★ 'మా యిద్దరి కథ' లో సన్నివేశం ★ ][ ★ ][ ★ ][ ★ ][ ★

# స్వయంవరం

[25 వ పేజీ తరువాయి]

.దువుమీదే వున్నది పెళ్లి గురించి ఆలోచించే వ్యవధి ఎక్కడిది ?

"ఇంకెంత పదిరోజుల్లో మొదలవుతున్నాయి కదా ?" సంధ్య అభిప్రాయం తెల్సుకోవాలని అతనికి తహతహ.

"అవును – పదిరోజులంటే - 240 గంటలు..."

"అయ్యబాబోయ్! అన్నిగంటలే ఆగలేను సంధ్యా! నువు నాదానివి. త్వరగా నువు నాదానివి కావాల..."

"అని ఎవరు అన్నారు ?" చంద్రశేఖర్ ఉద్వేగానికి అడ్డు తగిలింది సంధ్య.

"నేనంటున్నాను."

"మీరంటే సరిపోయిందా ?" కావాలనే నిలదీసింది సంధ్య.

"మరింకెవరనాలి ? మీ మమ్మీ, డాడీ ని ఇష్టమంటారి. నీకేమో నేనంటే ఇష్టమేగా ? అందుకనే నువు నాదానివి అంటున్నాను."

ఎంత అధికారం ?

ఆ మాటకువస్తే ఈయనకా అధికారం ఎవరిచ్చారు ? కాస్త చనువుగా, స్నేహంగా వున్నంతమాత్రాన "నువు నాదానివి" అంటాడా? ఈ అధికారం సంధ్య సహించలేకపోయింది.

ఇది జరిగిన మూడోరోజున –

పరీక్షలకు చదివి చదివి బోర్‌గా వుండటంతో ఫ్రెండ్ రాధ దగ్గరకని బయల్దేరింది సంధ్య.

కార్నర్ బుక్‌స్టాల్ దగ్గర మాగజేన్స్ తీసుకుంటున్నాడు భాస్కర్.

"ఎక్కడికి సంధ్యా! బయల్దేరావ్ ?" భాస్కర్ పల్కరించాడు.

చెప్పింది.

"మై గుడ్నెస్! నేను మీ యింటికి బయల్దేరాను.'

"ఓహో! అలాగా. రండి. వెళ్దాం."

"మరి – ఫ్రెండు దగ్గరకు వెళ్లవా ?"

"అంత అర్జంటు పనేమీ లేదులెండి. కాస్త ఛేంజ్ కోసం బయల్దేరాను."

"అయితే ఇంటికెందుకు – హోటల్‌లో కాఫీ తీసుకుందామా ?"

"పదండి."

"థాంక్యూ."

ఇద్దరూ హోటల్ పైన రూఫ్ గార్డెన్‌లో ఒక చివరగా ఖాళీగా వున్న బల్లవద్ద కూర్చున్నారు.

బేరర్ వచ్చాడు.

"ఏం తీసుకుంటావ్ సంధ్యా ? స్వీటా, హాటా ?"

"ఇంటిదగ్గర యిప్పుడే టిఫిన్ తీసుకుని బయల్దేరాను. ఏదయినా కూల్‌డ్రింక్ తీసుకుంటాను."

భాస్కర్ రెండు కోకోకోలా ఆర్డర్ చేశాడు.

"అదేమిటే, మీరు టిఫిన్ తీసుకోండి."

"నువ్వేది తీసుకుంటే నేనూ అదే తీసుకుంటాను. నీ యిష్టమే నా యిష్టం."

బేరర్ వెళ్లిపోయాడు.

"సంధ్యా! ఈరోజు మా నాన్నగారు ఉత్తరం వ్రాశారు." ఇది చాలా తరచుగా వినే ప్రారంభమే!

"అయితే – నన్నేం చేయమంటారు ?" చిలిపిగా ప్రశ్నించింది సంధ్య.

"నన్నేం చేయమంటావో చెప్పగలవా అని అడుగుతున్నా" భాస్కర్ కంఠంలో అర్థింపు ధ్వనించింది.

"ఏ విషయమో చెప్పకుండా – ఎలా ?" భాస్కర్ నోటమీదుగా ఆ విషయమేమిటో చెప్పించాలని సంధ్య వుద్దేశం.

''అదే... అదే... మన పెళ్ళి విషయం. ఈ వేసవిలో చేయాలంటున్నారు.''

''పరీక్షలు కానీయండి.'' మూడు రోజుల క్రితం చంద్రశేఖర్‌కి చెప్పినట్లుగానే ఈరోజు భాస్కర్‌కీ చెప్పింది.

''పరీక్షలు అయినతర్వాతనే పెళ్ళి. కాని ముందుగానే అభిప్రాయం చెపితే వాళ్ళ ప్రయత్నంలో వాళ్ళు వుంటారు.''

బేరర్ డ్రింక్స్ తెచ్చి, టేబుల్ మీద వుంచి, వెళ్ళిపోయాడు.

''తీసుకో — సంధ్యా!'' ఒక బాటిల్ సంధ్య ముందు వుంచాడు భాస్కర్.

సంధ్య 'డ్రింక్' త్రాగుతూ సమాధానం ఏం చెప్పాలా అని ఆలోచిస్తున్నది. భాస్కర్ దిగంతానికి చూస్తున్నాడు.

''సంధ్యా! ఒక్కసారి వెనక్కితిరిగిచూడు.''

వెనక్కితిరిగి చూసింది.

రాగహృదయంతో తనను చేరిన సూర్యునికి సంధ్యాకాంత స్వాగతం పలుకుతోంది. క్షణానికొక రంగు నింపుకుంటూ సంధ్యాసుందరి క్రొత్త అందాలు దిద్దుకుంటోంది — చాలా అందంగా, మనోజ్ఞంగా వుంది ఆ దృశ్యం.

''ఆ భాస్కరుడు ఏమంటున్నాడో వినపడిందా సంధ్యా!''




ఏమిటి? భాస్కర్‌కి ప్రకృతి అందాలు దర్శించే సహృదయమేకాక, వాటి భాష అర్థమయే సున్నిత మనసూ వుందా?

''మీరు ఇంజనీరు. యంత్రాల భాషే కాక, ప్రకృతి సందేశమూ మీకే తెలియాలి.''

''నేను నీవాడిని సంధ్యా! నీ హృదయాకాశంలో ఇంత స్థానమియగలవా — అని అర్థిస్తున్నాడు. ఆమె అంగీకరించి, హృదయానికి హత్తుకుంది. అదిగో ... చూడు ... చూడు మూడు ఇంట్లోకి వెళ్ళి తలుపులు కూడా వేసుకున్నారు...''

ఇప్పుడు సూర్యుడూ లేడు...సంధ్యాసుందరీ లేదు ... ఆకాశాన అక్కడక్కడ నక్షత్రాలు మిణుకు మిణుకు మంటున్నాయి.

ఎంత భావుకుడు భాస్కర్?

ఎంత సున్నితంగా తన మనోభావం వెలిబుచ్చాడు!

నువు నాదానివి — అని చంద్రశేఖర్ అంటే-

నేను నీవాడిని — అంటున్నాడు భాస్కర్.

* * *

సంధ్య ఉద్దేశం నాకిప్పుడు పూర్తిగా అర్థమయింది.

చంద్రశేఖర్ — నీవు నాదానివి — అనటంలో అధికారంతో కూడిన ప్రేమ వుంది. ఆ అధికారం సంధ్య సహించలేదు.

భాస్కర్ — నేను నీవాడిని - అంటున్నాడు. అంటే అతను చూపిస్తున్నది అధికారంకాదు, అనురాగం. సంధ్య కోరుకునేది అలాంటి మాట, అలాంటి హృదయం.

ఎంత సున్నితం ఈనాటి కన్నెమనసు!

ఎంత సుబద్ధం ఈ కాలపు యువతి ఆలోచన!!

అనురాగంతో కూడిన ప్రేమకోసం ఆస్థిపాస్తులు, నగలూ — నాణాలూ, నౌకర్లూ వదులుకున్నది. నేను నీవాడిని — అన్న ఒక్కమాట ఇచ్చిన తృప్తి, సుఖమూ, శాంతీ ఆమెకు మరేమీ ఈయలేకపోయాయి.

కాఫీ మూడు కప్పులలో పోసి, ట్రేలో వుంచి డ్రాయింగ్ రూమ్‌లోకి తెచ్చాను.

చంద్రశేఖర్ కూడా అక్కడికి వచ్చాడు.

కాఫీ తీసుకుంటూ — ''మీ ఆల్బం బాగుంది తీరికగా వస్తాను'' అన్నాడు.

''థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్. మా ఇంటి తలుపులు అతిథులకు తెరిచేవుంటాయి.''

''సంధ్యా! యిక వెళ్దాం పద!'' అన్నాడు చంద్రశేఖర్.

చంద్రశేఖర్ కంఠంలో—సంధ్య అన్నట్లుగా- అధికారమే ధ్వనించింది. ఇదే భాస్కర్ అయితే ''సంధ్యా! యిక వెళ్దామా?'' అనేవాడేమో! నా మనసులోని భావం గ్రహించిన సంధ్య, అది నిజం అన్నట్లుగా, తల ఊపింది.

వారిద్దరూ వెళ్ళిపోయారు.

భాస్కర్ని వరించిన సంధ్య, మరి చంద్రశేఖర్‌తో కలిసి ఈరోజు మా ఇంటికి వచ్చిందేమిటి? అన్న సందేహం కల్గింది.

అప్పటికే కారు కదిలిపోయింది.